# జ్యోతి

(సచిత్ర మాసపత్రిక)

## యాజమాన్యం, తదితర వివరాలు

ఫారం 4 (8వ నిబంధన ప్రకారం)

| | |
|---|---|
| ప్రచురణ స్థలం : | హైదరాబాదు |
| ఎంతకాలాని కొకసారి : | నెలకొకసారి |
| ముద్రాపకుని పేరు : | పి. రామకృష్ణ |
| జాతి : | భారతీయుడు |
| విలాసం : | 1—8—4/1/1, చిక్కడపల్లి<br>హైదరాబాదు-500 020 |
| ప్రకాశకురాలి పేరు : | శ్రీమతి వి. లీలావతి |
| జాతి : | భారతీయురాలు |
| విలాసం : | 1—8—4/1/1, చిక్కడపల్లి<br>హైదరాబాదు-500 020 |
| సంపాదకురాలి పేరు : | శ్రీమతి వి. లీలావతి |
| జాతి : | భారతీయురాలు |
| విలాసం : | 1—8—4/1/1, చిక్కడపల్లి<br>హైదరాబాదు-500 020 |
| పత్రిక యజమానురాలు : | శ్రీమతి వి. లీలావతి |

పై విషయాలు నాకు తెలిసినంతవరకు వాస్తవమైనవని తెలియజేస్తున్నాను.

1—3—1981
హైదరాబాదు

(సం.) వి. లీలావతి




డాక్టర్ కె.వి.కృష్ణకుమారి

# మనిషిలో దేవుడు

"మీరింక రెస్ట్ తీసుకోండి స్సార్.... కనీసం గంటైనా పడుకోండి-మళ్లా ఎమర్జెన్సీ-ముంచుకొస్తుందో ఏమో-" సిస్టర్ వంక కృతజ్ఞతతో చూస్తూ-నీరసంగా నవ్వాడు డాక్టర్ జగన్నాధ రావు.

"రెండున్నర దాటింది సార్.... మధ్యాహ్నం నుంచీ ఊపిరి కూడా తీసు

కోకుండా పని చేస్తున్నారు మళ్ళా...."

నమ్మకంగా తనని అంటి పెట్టుకునే, తల నెరిసిన వార్డ్ బాయ్ వంక చిరు నవ్వుతో చూశాడు.

అలసటెరుగని అతని నవ్వుని అనూహ్యమైన భావాలెన్నో కారు మబ్బుల్లా కమ్ముతూనే వున్నాయి.

డాక్టర్ జగన్నాధరావు గారు-ఈ యుగంలో పుట్టాల్సిన మనిషి కాదు. అంతా వ్యాపారమయమై-ప్రాణానికీ-డబ్బుకీ లంకె వేసే స్థితికి దిగజారిన ఈ పవిత్ర వృత్తిలో వుండాల్సిన మనిషి కాదంటారు తెల్సిన వాళ్ళు. "అందర్నీ బ్రతికించాలనే తాపత్రయమే గానీ తనూ-తన వాళ్లూ కూడా బ్రతకాలే-ఎలా బ్రతుకుతారు అన్న ఆలోచన కూడా లేని అమాయకుడను" కుంటారు చాలా మంది—

"ఉండకూడని లక్షణాలన్నీ వీడిలో వున్నాయి. ఒకటి-మితి మీరిన దయ. అది చెద పురుగులా నిన్నే తినేస్తుందిరా అంటే విన్పించుకోడు. రెండు—జాలి. ఎంత మంది మీదని జాలి చూపిస్తావయ్యా-అసలు నీకు తెలీదేమో—కర్కశంగా మాట్లాడి - దులపరించుకు పోయేవాడే - ధన్యుడు. నీలా జాలిపడుతూ అందరి గాధలూ వింటూ-దానాలు చేస్తూ కూర్చున్నావంటే-నిజంగానే నీ హార్ట్ ఎన్లార్జ్ ఐపోతుంది. నీ జేబు ఖాళీ ఐపోతుంది. గుండెను కుదించటం నీ చేతకాదు. జేబును నింపుకోటం నీ జాతకంలోనే వుండదు. ఎందుకంటే ఆ బుద్ధి నీలో వుంటుందన్న ఆశలేదుకనుక.

మూడు—స్వార్థాన్ని మరచి పని చెయ్యటం. ఇది మటుకు చాలా తప్పు. ఎవడి స్వార్థాన్ని వాడు చూసుక్కోలేక పోవటం క్షమించరాని నేరం. నీలో నిస్వార్థాన్ని ఇతరుల స్వార్థం దారుణంగా తినేస్తుంది. అంటే 'నిన్నే' నన్న మాట. స్వార్థమెరుగని వాడు అప్రయోజకుడై మనును. అదీ స్వల్ప కాలం.

నాలుగు—ఎవరి కోసమో శ్రమపడటం ఎందుకు? ఎందుకు పడాలి? వాళ్ళేమవుతారని? జలగల్లా రక్తాన్ని పీల్చే అవకాశ వాదులేగానీ అవసరానికి సాధనంగా ఉపయోగించుకుని కనీసం కృతజ్ఞతను చూపించాలన్న ఇంగితం కూడా లేని కృతఘ్నులేగానీ, నీ వల్ల ఉపయోగం పొందినవాళ్లు గానీ-నీ దయవల్ల బ్రతుకుతున్నవాళ్లు గానీ-ఒక్కసారైనా నీ గురించి ఆలోచిస్తారంటావా?-నీ శ్రమకు ప్రతిఫలాన్ని అందించగల స్తోమత వుండీ-మొహం చాటేసే దుర్మార్గులకోసం ఎందుకీ అనవసర శ్రమ.

ఐదు—గవర్నమెంట్ జీతమిస్తోంది కనుక పని చెయ్యి. అదీ-నీ ఆరోగ్యం చూసుకుంటూ, ముందు చూపును పెంచుకుంటూ పని చెయ్యి. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఇతరుల ఆరోగ్యంకోసం ఆలోచించు. నీ ఆరోగ్యం చెడిపోయాక ఏ ఆరోగ్య వంతుడూ నిన్ను మామూలు మనిషిని చెయ్యలేడు.

ఆరు—ఢబ్బు విలువ ఇప్పటికైనా తెల్సుకో. నీలో వున్న ప్రతీ రక్తం




బొట్టునీ ఉదారంగా వాడుకుంటూ దాని రుచి మరిగినవాళ్లు నీ చుట్టూ వున్నారు. నీ రక్తంలో ప్రతీ అణువు ఎంతో పవిత్రమైంది, ఎంతో విలువైంది. అపాత్రదానం చేస్తున్నావు.

ఏడు—ఇంత మంచితనం కూడదురా. ఇన్నేళ్లు జనం కోసం ఇంతగా శ్రమదానం చేస్తున్నావు. అందరూ వంది మాగధుల్లా నీ చుట్టూ చేరి భజన చేస్తున్నారు. బాగానే వుంది. ఏదో క్షణంలో ఏదో బలహీన క్షణంలో నీ మంచితనాన్ని అపార్థం చేసుకునే క్షణమంటూ ఏదైనా రావచ్చు. అప్పుడీ పెద్ద మనుష్యులందరూ బురఖాలు తీసేస్తారు తెల్సా. స్వతస్సిద్ధమైన జంతు రూపాలతో నిన్ను చిత్రవధ చేసి మరీ చంపుతారు తెల్సా. అప్పుడు నీకంటూ ఏం మిగుల్తుంది?

నీ కంటూ మటుకు మిగిలేదేమంటుంది.

ఎనిమిది— ..

శ్రేయోభిలాషుల హెచ్చరికలన్నీ చిరు నవ్వుతో తీసి పారేస్తారాయన. కారణం. "వాళ్ళు" చెప్పిన గుణాలన్నీ తనలో - వేళ్లు పాతుకు పోయాయి. ఎంత కష్టపడినా పెకిలించటం అసాధ్యం. నరనరానా జీర్ణించుకుపోయి వున్నాయి. ప్రతీ రక్త బిందువులోనూ-అందులోని ప్రతీ అణువులోనూ-స్వతస్సిద్ధమైన గుణంతో కల్సిపోయి వున్నాయి.

అవిలేని తను లేడు—

తను లేక పోతేనే అవి వుండవేమో.

అందుకే- జగన్నాధరావుగారు ఇప్పుడు ఈ కాలంలో పుట్టాల్సిన మనిషి కాడు.

బ్రతికించటమేగానీ, బ్రతక నేర్పటం తెలియని మనిషి.

"సిస్టర్ ఆ బేబీకి మళ్ళా ఫిట్స్ వస్తే..."

"పెరాల్‌డిహైడ్ ఇస్తా సార్-"

"సిస్టర్.. ఆ మధుసూధనరావ్‌కి- గుండె జబ్బూలేదూ ఏమీ లేదు. అంతా ఫంక్షనల్...."

"....సర్....వాళ్లారికే గొడవ చేసినా-సమాధానపరుస్తాం.

ఇప్పటి దాకా వీళ్ళతోనే సరిపోయింది....ప్లీజ్ - రెస్ట్ తీసుకోండి సార్-"

జగన్నాధరావుగారి పెదాలు తృప్తితో విచ్చుకున్నాయి.

యాభై పడిలో పడుతు'న్న ఆయన వయసూ, సర్వీసు దృష్ట్యా చూసినా-ఇలా నైట్ డ్యూటీస్ చెయ్యాల్సిన అవసరం లేదు. ఇంట్లో విశ్రాంతి తీసుకోవచ్చు. తీరిగ్గా, ప్రశాంతంగా. భార్యా పిల్లల్తో కాలక్షేపం చెయ్యచ్చు—

కానీ-ఆయన ఒక లక్ష్యానికి అంకితమైన వ్యక్తి.

బాధ్యతను - చివరి దాకా - బాధ్యతాయుతంగానే - నెరవేర్చాలనే నియమం వున్న మనిషి.

విరామ మెరుగని వృత్తి నేర్పిన మానవత్వంలో - వృత్తి చూపించే మానవత్వంలో - వృత్తిలో కన్పించే మానవత్వంలో నిండా మునిగిపోయిన మనిషి.

విశ్రాంతి అన్న పదానికి అర్థాన్ని మర్చిపోయాడు.

మానవత్వపు విలువలు వెదుకుతూ ముందుకు సాగిపోతూనే వున్నాడు.

"సార్-మంచినీళ్లు తేవాలా సార్-"

పక్క- సర్దుతూ-వినయంగా నిల్చబడ్డాడు నీడ లాంటి వార్డ్ బాయ్ శంకరయ్య.

"నేను తీసుకుంటాగానీ నువ్వు కాసేపు పడుకోమరి."

బలవంతంగా అణచిపెట్టుకున్న నిస్సత్తువ వెల్లువలా కమ్మేసింది.

గుండెను ఎవరో పట్టినట్లయి బరువుగా అన్పిస్తోంది.

ఫాన్ తిరుగుతున్నా ముచ్చెమటలు పట్టిన బాబుగారి వంక గాభరాగా చూశాడు శంకరయ్య.

"ఏం బాబూ కాసేపుండేదా?"

"వొద్దొద్దు....నువ్వెళ్లు"

శంకరయ్యని పంపించి బోల్టు వెయ్యబోతూ మరోసారి అన్నాడు.

"చూడూ... ఆ కేసులు....—"

"చిత్తం బాబూ -"

గది చల్లగా వుంది. మనసు వేడిగా వుంది.

గుండె మంచులా వుంది. అది గడ్డ కట్టుకుపోతున్నట్టుంది.

నిస్సత్తువ కళ్ళముందు చీకటిని పేరుస్తోంది.

అర్థమౌతోంది జగన్నాధరావుగారికి.

ఆత్రంగా అప్రయత్నంగా జేబులు వెతుక్కున్నారు. ఎప్పుడూ వెంట వుండే బిళ్ళలు—మర్చిపోయాడు....



పాపాయికి పుట్టుకతోనే మీరిచ్చిన కానుక- 3 నెలలకు సరిపడే ఐరన్



3 నెలలు నిండాక, కేవలం పాలే అతడికి కావలసిన ఐరన్‌ను సమకూర్చలేవు

అతడికి ఇవ్వండి ఫారెక్స్ పుష్కలంగా ఐరన్ గలది

"తల్లినుంచి పెద్ద ఐరన్ నిల్వతో సహా పుడతాడు పాపాయి. అయితే పుట్టిన తర్వాత ఈ నిల్వ క్రమేపీ తరిగిపోతుంది. పాలు మంచి ఆహారమే అయినప్పటికీ, ఐరన్ లేనందువల్ల అది సంపూర్ణ ఆహారం కాదు. అందుకే పాపాయికి ఐరన్ గల ఆహారాలు కావాలి."

డాక్టర్ సుభాష్ సి. ఆర్యా: "ఇన్‌ఫేంట్ అండ్ చైల్డ్ కేర్ ఫర్ ది ఇండియన్ మదర్"

డాక్టర్లు ఫారెక్స్ ఎందుకు సిఫార్సు చేస్తారు?

ఫారెక్స్‌లో పుష్కలంగా ఐరన్ కూడా ఉంది—అది మీ పాపాయి రక్తానికి, అతడి శరీర ఆరోగ్యానికి,




అతడి పెరుగుదలకూ, వికాసానికీ అతి ముఖ్యం.

..........................

ఉచితం! "పాపాయి మొదటి ఏడాది పుస్తకం."

మీ ప్రతి కోసం, 50 పైసల స్టాంపు జత పరుస్తూ ఈ క్రింది చిరునామాకు వ్రాయండి:

పి. ఒ. బాక్సు నం. 19119, (FAR 105 I)

బొంబాయి 400025.

..........................

డాక్టర్లు సిఫార్సు చేస్తారు ఫారెక్స్

సత్వరమైన, సంపూర్ణమైన పెరుగుదల కోసం పాపాయికి ఆదర్శవంతమైన ఘన ఆహారం

CASGLP-12-163 Tel

# చీరిన బాధ-జీర

ఉంగటం తెగిన చెప్పు మోస్తున్న
జీవితం భుజాలమీద భారంగాకాళ్ళు,
ఎండకి తార్రోడ్డుమీద కరుగుతూ
ముప్పై ఎనిమిది గ్రీష్మాల
ఖర్వాటుడ్ని—
సమాధానాలు దొరకవని తెలిసున్న
ప్రశ్నల్ని,
నా తలచర్మం కింది స్పాంజిలో
ఇంకిస్తూ
సానుభూతి భుజాల మీద
నిట్టూరుపు ల్నంటించి
సమస్యల్ని పొగలు
మింగుతాయని, వార్డిమ్
జేబులోంచి పొగ
గొట్టాల్ని నిలబెట్టి
పెదాలమీద
పొగ
బ్రోంకియల్ ట్రీని ఆక్రమించి
గొంతు మడతలో చిక్కుకుని
ఊడక
ఊగుతూ
ఊపూవుతూ, నాలిక మీద
టేస్ట్ బడ్స్ ఎండి,
ఎక్కడో
నేను
చితికి చతికిలపడి, నా
కాళ్ళు నడుస్తూనే వుంటాయ్
సైగల్ గొంతు చీరిన బాధల జీరలా

— భైరవయ్య

కర్తవ్యం హడావుడిలో, పని వత్తిడిలో—

అతి ప్రయత్నం మీద మంచంమీద పడుకున్నా ప్రాణమెటో తేలిపోతున్నట్టుంది.

మరుక్షణంలో తలుపులు కొడుతున్న చప్పుడు!

హడావుడిగా లేవబోయిన ఆయన గుండెలో ఏదో కలుక్కుమంది.

తలుపు మీద చప్పుడు ఎక్కువగా విన్పిస్తోంది.

దాంతో బాటే—శంకరయ్య ఘర్షణా విన్పిస్తోంది.

గొంతు తడారిపోతుంటే నాలు గుక్కలు నీళ్ళుత్రాగి విధిలేనట్టు తలుపు తియ్యబోయారు.


కంటి ముందు చీకటిని చీల్చుకుంటూ వెలుగులాంటిదేదో కన్పించింది.

"ఎవరూ—"

తప్పు చేసినట్లు తలదించుకున్నాడు శంకరయ్య.

"బాబూ....ఆ ఫిట్స్ వచ్చే పాప తండ్రిట, ఇప్పుడే ఊర్నుంచొచ్చాట్ట. పాప మగతగా వుంటే మీరు చూడకుండా నిద్రపోతున్నారని గొడవ పెడుతున్నాడు....

"....అవును పాప వొళ్ళెరక్కుండా పడుంది. మీకేదీ పట్టనట్టు తలుపులు బిడాయించుకున్నారు.... కొట్టీ కొట్టీ మా చేతులు పోయాయి....ఓ సారొచ్చి పాపను చూడండి—"



డాక్టరంటే తన క్రింద నౌఖరన్నట్టు గదమాయించి మరీ అడుగుతున్నాడు పెద్ద మనిషి.

"ఆ మత్తు, ఇంజక్షన్ వల్లయ్యా బాబూ-చెపితే విన్పించుకోవేం....

ఇప్పటి దాకా డాక్టరు గారు కేసు చూసి ఇప్పుడే పడుకున్నారు...."

సిస్టర్ డాక్టర్ వైపు వకాల్తా పుచ్చుకున్నట్టు మాట్లాడుతుంటే ఆ పెద్ద మనిషికి చిర్రెత్తు కొచ్చింది.

"ఐతే పిల్లను చూడరా ...ప్రాణం పోయినా.... ...."

అతి కష్టం మీద రాబోయి ఆగి పోయారు జగన్నాధరావు గారు.

"....ప్రాణానికి ప్రమాదం లేదు.. ఇంజక్షనిచ్చాం కదా....కదిలించకూడదు .... మళ్లా ఫిట్స్ వస్తే చెప్పండి...."

బలవంతాన వొత్తి పలుకుతున్న డాక్టర్ని ఒక త్రాగుబోతును చూసినట్టు చూశాడా పెద్ద మనిషి—

"మీరు పడుకోండి సార్...."

సిస్టర్ తలుపు వెయ్యటమూ, అతను అసహ్యంతో కాండ్రించటమూ ఒకే సారి జరిగాయి.

బోల్టు వెయ్యటం కూడా మరచి అచేతనుడై పోయారాయన.

బరువుగా అడుగులు వేస్తూ మంచం

వైపుకు నడిచాడు.

కొంత సేపటికి ...

మళ్లా గుమ్మం దగ్గర గొడవ వినపడుతోంది.

శంకరయ్యని మింగేసేలా మాట్లాడుతున్నాడింకో పెద్ద మనిషి.

"కాస్త మెల్లిగా మాట్లాడవయ్యా బాబూ...."

శంకరయ్య అభ్యర్ధన గాలిలో కల్సిపోయింది.

"మెల్లి గేంటయ్యా-మెల్లిగా - ఆడు గుండె జబ్బొచ్చి సస్తే మీరూ - మీ డాట్రూ కటకటాల ఎనక్కెల్లి పోవాల. అర గంట కాడినుంచీ సూత్తుండా-మావోడికి గుండె నెప్పి తగ్గే లచ్చనాలేమైనా వున్నయ్యా?—సూడలేక మా వోల్లు సత్తున్నారు గానీ ఆ డాట్రు ఆయిగా తొంగుండాడే. తొంగో టానికిటయ్యా డూటీలు సేసేది.... ఇంటికాడి కెల్లి తొంగోమను. శాసివితంగా తొంగోమను. మల్లా ఆడ్నిడికి రానీ కుండా సేత్తా. మినిట్టరు మా బామ్మరిదే. ఓయ్...."

దూకుడుగా వుంది వ్యవహారం.

జగన్నాధరావు గారి కళ్లు శూన్యంలోకి చూస్తున్నాయి.

వొళ్ళంతా మంచు ముద్దలా వుంది.

గుండె మీద కొండని విడిచి పెట్టినట్టున్న బాధ అనూహ్యంగా వుంది.

విసురుగా లేచి వెళ్ళాలని వుంది.

అసహ్యంగా-అనాగరికంగా - అధికార దర్పంతో వాగుతున్న ఆ నోటిని మూయించాలని వుంది.

ఏ గుండె జబ్బులేని వాళ్ళ ముద్దుల కొడుకు తెచ్చిపెట్టుకున్న భాగవతం కోసం గుండె జబ్బున్న, తను కేవలం వాళ్ళని శాంతిపరచటానికే తృప్తి పరచటానికే విశ్రాంతి మరచి పాటుపడ్డానని అరవాలని వుంది.

చీటికీ మాటికీ కంగారుగా పిల్చే వాళ్ళ అధికార దర్పంతనకీరోజు కాస్త కూడా విశ్రాంతిని మిగల్చలేదనీ, శాశ్వత విశ్రాంతినే మిగుల్చుతోందనీ చెప్పాలి. హాస్పిటల్ వాళ్ళు వాళ్ళకి యిలా అడ్డుపడేది—

తనకున్న గుండె జబ్బుకు జాలిపడి, తను నింపిన ఆప్యాయతకు, ఆపేక్షతో ఏదో చెయ్యాలన్న తపన పడి,

అంతే.... అంతే.

ఇంక ఆలోచించలేకపోతున్న జగన్నాధరావుగారి కళ్ళముందు అస్పష్టమైన ఆకారాలు జాలిగా కదులుతున్నాయి.

ప్రజాసేవ ప్రజాసేవ అంటూ ఆరోగ్యాన్నీ సర్వస్వాన్నీ ప్రజలపరం చేసినా ఆవగింజంతైనా విశ్వాసంలేని ప్రజలను తల్చుకుని తనని తిట్టుకుంటూ జాలిగా నవ్వుతోంది అర్ధాంగి లక్ష్మి.




## ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫిలిమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్.

(రాష్ట్ర ప్రభుత్వ సంస్థ)

"గృహకల్ప" ఎం. జె. రోడ్ హైదరాబాదు-500 001

ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి నిరంతర కృషి!

| సినీమాహాళ్ళ నిర్మాణానికి ఋణాలు | 1-2-1981 తేదీనాటికి జరిగిన అభివృద్ధి |
|---|---|
| 50,000 అంతకు మించని జనాభా గల గ్రామాలకు, పట్టణాలకు పరిమితం.<br>మొత్తం పెట్టుబడి రు. 6 లక్షలకి మించరాదు.<br>రు. 3 లక్షలు లేక 2/3, యేది తక్కువ మొత్తమైతే అది.<br>రుణం 84 సమాన నెలసరి వాయిదాలలో తిరిగి చెల్లించాలి.<br>నిర్ణీత తేదీలలో రుణం చెల్లించితే 15 శాతం వడ్డీ, 3 శాతం రిబేటు. | 99 సినిమా హాళ్ళ నిర్మాణానికి రుణాలు మంజూరు చేయబడ్డాయి. రు. 2.36 కోట్లు. ప్రదర్శన ప్రారంభించబడిన సినిమా హాళ్లు 79. |
| సినీమా స్టూడియోలు, లేబొరేటరీలు వగైరా నిర్మాణానికి రుణాలు | |
| నిర్మాణ వ్యయంలో 70 శాతం నుంచి 80 శాతం వరకు రుణ సహాయం.<br>తొలి 5 సంవత్సరాల వరకు 9 శాతం వడ్డీ, ఆ తరువాతి 10 సంవత్సరాలకు వడ్డీ 12 శాతం. | 5 స్టూడియోలకి - రుణాలు మంజూరు చేయబడ్డాయి. రు. 75.09 లక్షలు. |
| డాక్యుమెంటరీలు, వార్తాచిత్రాలు | |
| ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున డాక్యుమెంటరీలు, న్యూస్‌రీళ్ళు కొనడం, నిర్మించడం, వివిధ ప్రభుత్వ శాఖలకు, వాటి క్షేత్రబృందాలచేత ప్రదర్శించబడడానికి అందజేయడం! | నిర్మించబడిన డాక్యుమెంటరీలు, వార్తాచిత్రాలు : 24.<br>నిర్మాణంలో వున్నవి : 14.<br>ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాఖలకి అందజేసినవి : 70. |

ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి యింకా అనేక కార్యక్రమాలు!

—మేనేజింగ్ డైరెక్టర్.

అందరి పిల్లలూ తన వాళ్ళేనని పరపతి నుపయోగించి ప్రయోకుల్ని చేసినా శక్తి కొద్దీ పాటుపడి ఆత్మ తృప్తిని మిగుల్చుకున్నా కనీసం కృతజ్ఞత కూడా వాళ్ళ నుంచి ఆశించక పోయినా ఆ కృతజ్ఞత ఏనాటికైనా మిగిలి వుండి తమకు అన్నం పెడ్తుందేమోనని అనాధలుగా చూస్తున్న పిల్లలు కన్పిస్తున్నారు....

కన్పించటంలేదు.

విసురుగా తలుపులు తెరుచుకున్నాయి.

"అసలీ డాక్టరున్నాడా లేడా గుమ్మంకాడింత గోల జరుగుతావుంటే నిమ్మకు నీరెత్తినట్టు పడుకున్నాడా? ఈడ్చించి బదిలీ సేయించి పారేత్తా"

అహంకారం మృగంలా మొరుగుతోంది.

మంచి తనం దేవతలా అదృశ్యమైంది.

అనుమానంతో శంకరయ్య, సిస్టరూ డాక్టర్ రూమ్‌లోకి అడుగు పెట్టారు.

"............"

"ఏందయ్యా..ఎల్లినోల్లేమయ్యారూ? ఆ డాక్టరసలు మడిసేనా అంట"

లోపల్నుంచొచ్చిన శంకరయ్య గుమ్మం ముందున్న జనాన్ని పిచ్చిగా చూశాడు.

"ఆయన మనిషికాదు బాబూ. అందుకే ఈ మనుష్యుల్లో వుండలేక వెళ్ళిపోయారు"

రెండు చేతుల్తో మొహాన్ని దాచుకుని భోరుమని ఏడ్చేశాడు.

వెక్కిళ్ళుపెట్టి ఏడుస్తూనే వుంది సిస్టర్!

✻







తాడిమళ్ళ రామకృష్ణ

మినీకథ

# భార్య

రాత్రి పది గంటలవుతోంది.

మొదటి ఆట సినిమా కూడా వదిలేశారు.

'నాన్న వచ్చేస్తే బావుండును!'

మరోసారి అనుకుంది మంజుల–మనసులో.

నాన్న ఇంటికి రాగానే జరగబోయే బీభత్సం తనకి తెలియంది కాదు!

రోజూ జరిగే భాగోతమే అది!

అయినా తను ఆ చిటపటలకు అలవాటు పడలేదు.

రానురానూ అమ్మకి మరీ మతి పోతోంది.

'పాపం! తెల్లవారకుండానే లేచి ఫైళ్లలో మునిగిపోతారు నాన్న. ఆ తర్వాత హడావిడిగా ఆఫీసుకు పరుగెడతారు. సాయంత్రం వరకూ తల త్రిప్పటానికూడా తీరిక వుండని పనిట—ఆఫీసులో.

సాయంత్రం అవగానే క్లబ్‌కి వెడతారు నాన్న.

అదయినా రిలీఫ్ కోసం—ఆ ఫైళ్ళనుంచి! ఆ టెన్షన్ నుంచి! ఆ చిరాకుల నుంచి ఆ రోటీన్ నుంచి!

ఈ మాత్రానికే అమ్మ నానా రభసా చెయ్యాలా!

పాపం నాన్న ఎంత సర్ది చెప్పినా వినదు–

తన మొండి తనం తనదే!

తన వితండ వాదం తనదే!

తనకు నాన్నని చూస్తే జాలి.

అర్థం లేకుండా—

అర్థం చేసుకోకుండా—

అమ్మ అలా నాన్న మీద విరుచుకు పడటం, అందునా ఎదిగిన పిల్ల ముందు కీచులాడటం—

ప్చ్..........

మంజుల మనసు మండి పోతూంటుంది—తల్లి మీద.

*　　*　　*　　*

మంజుల మండి పడుతోంది—

ఆఫీసు అవగానే ఇల్లు చేరని భర్త మీద.

రాత్రి ఏ పదవుతేనోగానీ గూటికి చేరని రామారావు మీద.

'ఆఫీసు గొడవల్నుంచి, ఇంటి సమస్య నుంచి కొంచెం రిలీఫ్ కావాలే మంజూ! అందుకే ఆఫీసు అవగానే క్లబ్‌లో స్నేహితులతో సరదాగా గడిపి వస్తుంటాను.

ఇంత మాత్రానికే నువ్వు గొడవ చేస్తే ఎలా!'

బ్రతిమాలుతున్నాడు రామారావ్.

"ఆహాహా....రిలీఫ్‌ట రిలీఫ్! ఇక్కడ ఇంట్లో ఒక్కర్తినే చావాలి కాబోలు. అసలు ఇప్పుడు మాత్రం ఇంటికెందుకొచ్చారు? వెళ్ళి ఆ రిలీఫ్ క్యాంప్‌లోనే వుండండి." ఆవేశంగా అరిచింది మంజుల.

ఆ సమయంలో ఆమెకి తన చిన్నతనం గుర్తులేదు.

✻